క్లుప్తంగా

కార్మిక చట్టాలను కాలరాయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

కడప ఎడ్యుకేషన్: కార్మికులు త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను కుదించి వారి హక్కులను కాలరాయొద్దు అని రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ సుబ్బరాయుడు అన్నారు. జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కడప నగరంలోని తమ సంస్థ కార్యాలయలో జరిగిన సమావేశంలో సుబ్బరాయుడు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని ట్రేడ్ యూనియన్లు, స్వతంత్ర సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల నాయకులు పాల్గొనాలని కోరారు. పాలస్తీనా, ఇరాన్‌పై మారణం హోమం ఆపాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, కళ్యాణ్, గోపి, సురేంద్ర, సుధీర్, భరత్, సుబ్బరాయుడు, నరసింహ హరికృష్ణ, నరసింహరావు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని మా అమ్మ ఒడి ఆశ్రమంలో ఉంటున్న చిన్నారులకు బుధవారం పుస్తకాలను పంపిణీ చేశారు. కడపకు చెందిన ఉదయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ముంబయికి చెందిన డాక్టర్ ముక్కు కిరణ్మయి ఆర్థికసాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకుచేరుకోవాలని సూచించారు. దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాల్సిన అవసరాన్ని గుర్తించాలని ఆయన కోరారు.

విద్యార్థినుల ప్రతిభ

కడప కోటిరెడ్డిసర్కిల్: పాలిటెక్నిక్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కేఎల్‌ఎం విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌కు చెందిన మహిమ 95 శాతం, రేష్మ 90 శాతం, దీపిక 85 శాతం మార్కులు సాధించారు. కంప్యూటర్ సైన్స్‌లో యక్షితారెడ్డి 91శాతం, మహేశ్వరి 90శాతం, వెన్నెల 89 శాతం మార్కులు సాధించారు. ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌లో మనీషా 87 శాతం, వర్షిత 87 శాతం, ఇంద్రజ 84 శాతం మార్కులు సాధించి తమ ప్రత్యేకత చాటుకున్నారు. విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల కళాశాల కరస్పాండెంట్ రాజేశ్వరి, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కే.చంద్రఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంపీ రత్నమ్మ, ప్రథమ సంవత్సర విభాగాధిపతి డి.ప్రభావతి విద్యార్థినులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

క్రమశిక్షణతో ఉండాలి


మాట్లాడుతున్న సీఐ ఈదురుబాషా

కడప ఎడ్యుకేషన్: పోటీ ప్రపంచంలో విద్యార్థులు క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సీఐ ఈదురు బాషా తెలిపారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కాలేజీ విద్యార్థినులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. అనంతరం పోక్సో యాక్టు, పిల్లల భద్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్ఐలు శాంతమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక

బద్వేలు అర్బన్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన అతికారి దక్షిత, తుడిమిళ్ల నాగశ్రీవిద్య నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలకు, పటాన్ తనీర్‌రుల్ హసన్ ఆర్‌కే వాలి (ఇడుపులపాయ) ట్రిపుల్ ఐటీ కళాశాలకు, ఎస్.ఇంతియాజ్, పి.గణేష్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలకు, ఊట్ల శ్రీలక్ష్మి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ముగ్గురాయి తవ్వకాల పరిశీలన

పెండ్లిమర్రి : నాగాయపల్లె సమీపంలోని తుమ్మలూరు రెవెన్యూ పొలం సర్వే నంబర్ 874లో అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని బుధవారం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, బీట్ ఆఫీసర్ సంజీవ్‌రెడ్డిలు పరిశీలించారు. అక్రమంగా ముగ్గురాయి తవ్వకాలు గనులు- భూగర్భశాఖ పరిధిలో కాకుండా ఫారెస్టు భూమిలో చేపడుతున్నారని మైనింగ్ అధికారులు వారికి నివేదించడంతో ఫారెస్టు అధికారులు తవ్వకాలను పరిశీలించారు. చుట్టు కొలతలు వేశారు. తదుపరి నివేదిక పై అధికారులకు అందజేస్తామన్నారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సు



కడప కోటిరెడ్డిసర్కిల్: కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం అనంతపురానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో కడప కోటిరెడ్డిసర్కిల్ వద్దకు చేరుకుని మొరాయించింది. బస్సు సర్కిల్ మధ్య భాగంలో నిలిచిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తాయి. ఈ క్రమంలో పోలీసు సిబ్బంది, స్థానికుల సాయంతో బస్సును అతి కష్టంపై పక్కకు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో మొరాయించడం తమ అదృష్టంగా భావిస్తున్నామని, అదే అటవీ ప్రాంతంలో చెడిపోయి ఉంటే మా పరిస్థితి దారుణంగా ఉండేదని పలువురు ప్రయాణీకులు వాపోయారు. ఈ విషయంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి దూర ప్రాంతాల సర్వీసులను క్షుణ్ణంగా తనిఖీచేసిన తర్వాతే బయటికి పంపాలని కోరుతున్నారు.

ఆధునిక బోధనా పద్ధతులు తెలుసుకోవాలి


ప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో అధ్యాపకులు ఆధునిక బోధనా పద్ధతులు తెలుసుకోవాలని అనంతపూర్ గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ జువాలజీ లెక్చరర్ జీఎల్‌ఎన్.ప్రసాద్ అన్నారు. ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టింగ్ అడాప్టబిలిటీ ఇన్ ద ట్వంటీ ఫస్ట్ సెంచరీ టీచింగ్ ప్రొఫెషన్‌పై ఐక్యూసీ తరుపున బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో అడాప్టబిలిటీ ఎంతో అవసరం అన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా, ఐక్యూసీ కోఆర్డినేటర్ డాక్టర్ సివి.కృష్ణవేణి మాట్లాడుతూ కంప్యూటర్ యుగం నుంచి ఆర్టిఫిషియల్ యుగంలోకి వచ్చామన్నారు. ఐఓటీ సైబర్ సెక్యూరిటి సరికొత్త బోధనా విధానాలు ఉపయోగించుకుని విద్యార్థులకు బోధించాలని సూచించారు. అనంతరం జీఎల్‌ఎన్.ప్రసాద్‌ను అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు దాతల సహకారం అవసరం



ప్రింటర్ అందజేస్తున్న ఆకుల సత్యనారాయణ

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం ఎంతో అవసరం అని డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కడప నగరపాలక ఉర్దూ మెయిన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులకు ఆర్యవైశ్య అఫీషియల్ ప్రొఫెసర్ అసోసియేషన్(ఆవోపా) నాయకులు ప్రింటర్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆకుల సత్య ప్రసాద్ మాట్లాడుతూ తమ తండ్రి ఆకుల వెంకటపాపయ్య జ్ఞాపకార్థం ప్రింటర్ అందచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆవోపా మహిళా విభాగం అధ్యక్షురాలు కృష్ణవేణి, రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న ప్రభాకర్

బద్వేలు అర్బన్: ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రభాకర్ విమర్శించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం జీవీ భవన్‌లో నిర్వహించిన ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం వంటివి పాఠశాలలోనే విక్రయిస్తూ దోచుకుంటున్నారని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న దోడిపీని అరికట్టడంలో విద్యాశాఖాధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీను, పట్టణ కార్యదర్శి మదు, జిల్లా సమితి సభ్యులు రామకృష్ణ, సుధాకర్, సుజన్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎం శిక్షణకు ఉపాధ్యాయులు హాజరవ్వాలి


ఎంఈఓ కార్యాలయాన్ని సందర్శించిన వీరేంద్ర

సిద్దవటం : ఎఫ్‌ఎల్‌ఎం శిక్షణకు మండలంలోని ఉపాధ్యాయులందరూ హాజరయ్యేలా చూడాలని సిద్దవటం ఎంఈఓలకు సూచించామని సమగ్ర శిక్ష అభియాన్ అకాడమిక్ మానిటరింగ్ అధికారి వీరేంద్ర తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని ఎంఈఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మండల వ్యాప్తంగా పిల్లల ఎన్‌రోల్‌మెంట్ ఎంత ఉందో అడిగి తెలుసుకున్నారు. సర్వేపల్లె రాధాక్రిష్ణ విద్యార్థి మిత్ర కిట్స్ విద్యార్థులందరికి అందాయా లేదా అనే విషయాన్ని ఆరా తీశారు. మండలంలో ఎక్కడైనా ఉపాధ్యాయుల కొరత ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. ఎలాంటి కొరత లేదని ఎంఈఓలు వివరించారు. పాఠశాలలో హెడ్ టీచర్‌లు, ప్రధానోపాధ్యాయుల అకౌంట్లను చేయించాలని సూచించామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-1 పద్మజ, ఎంఈఓ-2 అరుణ, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పరీక్షలో విద్యార్థిని సత్తా

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ శివారులో ఉన్న శ్రీ వాసవి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్ కళాశాల విద్యార్థిని పి.శ్వేతకు జాతీయ స్థాయి పరీక్ష జీపీఏటీ - 2025లో 809వ ర్యాంకు సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థిని శ్వేత జాతీయ స్థాయిలో 809వ ర్యాంకు సాధించడం వల్ల సంతోషంగా ఉందన్నారు. విద్యార్థిని ఈ ర్యాంకు సాధించడం వల్ల స్టైఫండ్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సు యూనివర్శిటీలో పొందవచ్చునన్నారు. అలాగే ఫార్మసీ కంపెనీలో మంచి ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. అనతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రదీప్‌కుమార్‌తో పాటు ఎన్.ఎస్.ఎస్. అధికారి బి.జగదీష్‌బాబు, ఫ్యాకల్టీలు ర్యాంకు సాధించి విద్యార్థిని శ్వేతకు శుభాకాంక్షలు తెలిపారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి


జాగ్రత్తలను రైతులకు వివరిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని కె.అప్పాయపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె రైతులకు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే పలు రకాల పంటల సాగు, పాటించిచాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. రసాయనిక ఎరువులు విచక్షణారహితంగా వాడటం వలన వివిధ రకాల సూక్ష్మ పోషక లోపాలు కనిపిస్తున్నాయని ఆమె సూచించారు. పంటపై లోప లక్షణాలు గమనించినప్పుడు మాత్రమే రైతులు సవరణ చర్యలు చేపడుతున్నారని, పంటల సంరక్షణకు ఇది సరైన పద్ధతి కాదన్నారు. మొక్కలో సరైన పెరుగుదల, అభివృద్ధి, ఉత్పత్తి కొరకు అన్ని పోషకాలు సమతుల్యంగా అందించాలన్నారు. భాస్వరం ఎరువును జింక్ సల్ఫేట్‌తో కలిపి భూమిలో వినియోగించ రాదన్నారు. జింకు, భాస్వరం ఎరువుల వినియోగం మధ్య మూడు రోజుల వ్యవధి ఉండాలన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. పరీక్ష ఫలితాల ద్వారా అధికారులు సిఫార్సు చేసిన ఎరువులను మాత్రమే రైతులు వినియోగించాలని ఆమె సూచించారు. వరిలో ప్రతి మూడు సీజన్లకు ఒక సారి ఏకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను ఆఖరి దుక్కుల్లో వేసుకోవడం వలన జింక్ లోపాలను నివారించ వచ్చన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు వరి నారు కొనలు తుంచి నాటుకోవాలన్నారు. వరి నాటు వేసే సమయంలో ప్రతి రెండు మీటర్లకు 30 సెంమీ. వెడల్పు గల కాలిబాటలు తీయాలన్నారు. దీని వలన మొక్కలకు గాలి, వెలుతురు బాగా అందుతాయని, తద్వారా దోమపోటును నివారించవచ్చన్నారు. పొలం గట్ల పై కలుపు లేకుండా శుభ్రం చేసుకోవడం వలన పాము పొడ తెగులు వ్యాప్తి తగ్గుతుందన్నారు. పొలం గట్లపై బంతి, చామంతి, అలసంద, నువ్వు మొదలైన మొక్కలు నాటినట్లుయితే మిత్ర పురుగుల అభివృద్ధి పెరుగుతుందని, దీని ద్వారా క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో లత, స్వరూప, వీఏఏలు ఇందిర, శివ రంజని, రైతులు పాల్గొన్నారు.

వల్లూరు : ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం లాభదాయకమని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గోటూరు గ్రామ పంచాయతీలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇందులో డెమోగా ద్రవ జీవామృతాన్ని రైతులచే స్వయంగా తయారు చేయించారు. కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ కిరణ్‌కుమార్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

అమెరికా చర్యలను ప్రపంచ దేశాలు వ్యతిరేకించాలి


నిరసన తెలుపుతున్న కమ్యూనిస్టు నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: అరబ్ దేశాల ఆయిల్ నిక్షేపాలను కొల్లగొట్టేందుకు, యుద్ధాలు జరిగితే ఆయుధాలు అమ్ముకోవచ్చు అంటూ కపట నాటకాలాడుతున్న అమెరికా చర్యలను ప్రపంచ దేశాలు వ్యతిరేకించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఏ.సత్తార్, నజీర్ అహ్మద్, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ధర్మ పరిచయ కమిటీ నాయకులు బాబూబాయ్ డిమాండ్ చేశారు. అన్నారు. నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో పాలస్తీనా, ఇరాన్‌లపై-ఇజ్రాయిల్, అమెరికా యుద్ధం అంశంపై బుధవారం చర్చా దిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసు క్రీస్తు మరణానికి కారణమైన యూదులను రెండో ప్రపంచ యుద్ధం తర్వాత హిట్లర్ గ్యాస్‌చాంబర్‌లో వేసి చంపేశారని, వేలాది మంది యూదులకు ఆ క్షణంలో ఆశ్రయమిచ్చిందని పాలస్తీనా అన్నారు. పాలస్తీనా నాయకుడు యాసర్ అరాఫత్‌ను విషప్రయోగం ద్వారా చంపేయడమేగాక, తిరగబడిన వారిని కిరాతంగా చంపేశారని, స్కూళ్లు, ఆస్పత్రులపై దాడిచేసి వేలాది మందిని పొట్టన పెట్టుకున్నారని తెలిపారు. ఇరాక్‌లో అణు ఆయుధాలున్నాయని నెపం మోపి వేలాది పౌరులను చంపేశారని, ఆ దేశ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ను ఉరిశిక్ష వేశారన్నారు. ఐక్యరాజ్యసమితి అణు ఆయుధాలు లేవని తేల్చిన తర్వాత ×సారీ × అని అమెరికా సరిపెట్టిందని గుర్తు చేశారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ ఇరాన్ తమ మిత్ర దేశమని అనేక సార్లు ప్రశంసించారన్నారు. ప్రపంచ దేశాల దృష్టిలో యుద్ధం ఆపుతున్నట్లు అమెరికా నటిస్తోందని, ఇజ్రాయిల్ అణు ఆయుధాలు కలిగినా ఏమీ చేయలేదన్నారు. మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయకుండా, చమురు ఉత్పత్తుల ధరలు పెరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రపంచ దేశాలపై ఉందని వారు అన్నారు.

ఈ చర్చా వేదికలో బందెల ఓబయ్య, సలావుద్దీన్, మల్లెల విజయభాస్కర్, మహబూబ్‌బాషా, అష్రాఫ్ అలీఖాన్, జాకీర్ మౌలానా, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సత్తార్

ఆధిపత్య ధోరణిని వ్యతిరేకించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మెరికా అధిపత్య ధోరణి వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో వామపక్ష నాయకులు బుధవారం నిరసన తెలిపారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచంపై అమెరికా ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తోందని, ఇప్పటివరకూ జరిగిన 104 యుద్ధాలు ఆ దేశ వ్యాపార లాభాల కోసమేనని ఆరోపించారు. అత్యంత అరుదైన, విలువైన నిక్షేపాలు, గనులు, ఆయిల్, గ్యాస్ దోపిడీ చేసే దిశగా యుద్ధాలు చేస్తోందని తెలిపారు. పాలస్తీనా, ఇరాన్‌పై ఇజ్రాయిల్, రష్యాపై ఉక్రెయిన్, చైనాపై తైవాన్, ఉత్తర కొరియాపై దక్షిణ కొరియా యుద్ధ మేఘాలు అమెరికా ప్రేరేపితాలేనని గుర్తుచేశారు. అమెరికా స్వార్థ పూరిత ఆయుధ వ్యాపార సైనిక కుట్రలను ప్రపంచం ఎదుట బహిర్గతం చేస్తున్న కమ్యూనిస్టు దేశాలను అష్టదిగ్బంధం చేయటానికి ప్రయత్నిస్తోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బాదుల్లా మాట్లాడుతూ అమెరికా దుర్మార్గాలకు, ఇజ్రాయిల్ దురాక్రమణలకు హద్దు లేకుండా పోయిందన్నారు. అణు ఆయుధాలు ఉన్నాయని చెబుతూ పలు దేశాల అభివృద్ధిని నాశనం చేస్తుండడంపై ప్రజా నిరసనలు వస్తున్నాయన్నారు. సీపీఐ ఎం.ఎల్ జిల్లా కార్యదర్శి బి.ఓబయ్య మాట్లాడుతూ అమెరికా తీరును ఆ దేశ సైన్యం హర్షించడం లేదని, పాలకుల వైఖరిలో మార్పు రావడం లేదని అన్నారు. అంతర్జాతీయ న్యాయ చట్టాలను ఉల్లంఘించి అమెరికా దుర్మార్గాలకు పాల్పడుతోందని ప్రశ్నించారు. నరేంద్రమోదీ అలీన, విదేశాంగ విధానాన్ని విస్మరించి.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జపం చేస్తున్నారని ఆరోపించారు. ఇజ్రాయిల్ దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఎ.రామ్మోహన్, మనోహర్, అన్వేష్, కె.శ్రీనివాసులురెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, సుబ్బరాయుడు రమణయ్య, రాము, సావంత్, సుధాకర్, గోపి నరసింహ, నాగరాజు, గోపాల్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చదువు పేరుతో కార్పొరేట్ విద్యా సంస్థల వ్యాపారం


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చదువుల పేరుతో లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నాయని, అరికట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని అన్నారు. నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టాన్ని ఎక్కడా అమలు చేయకుండా లక్షల రూపాయల వ్యాపారానికి తెరలేపారని విమర్శించారు. చైతన్య, నారాయణ, భాష్యం, తదితర విద్యా సంస్థలలో తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. వస్తువులు అమ్మరాదని నిబంధన ఉన్నా.. ఎక్కడా అమలు కావడం లేదన్నారు. అధికారులు విద్యా సంస్థల్లో తనిఖీలు నిర్వహించకపోవడంతో ఫీజుల వసూళ్లు మరింత పెరిగాయన్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో విజయ్, సాయి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై ఏఐఎస్‌బీ పోరాటం


నినాదాలు చేస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్: విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం చేస్తామని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ తెలిపారు. ఏఐఎస్‌బీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కడప బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం పార్టీ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ సర్కార్ కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ, కాషాయీకరణ విధానాలతో దేశంలో విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనివర్సిటీలను అభివృద్ధిపరచకుండా అనిల్ అంబానీ, ఆదానీలకు కొమ్ము కాస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. డీఎస్సీ నిర్వహించి చేతులు దులుపుకుంటే సరిపోదని విద్యారంగ సమస్యలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సగిలి రాజేంద్రప్రసాద్, నాయకులు అఖిల్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐ జావేద్, సమావేశంలో పాల్గొన్న ఎన్‌సీసీ విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డికె.జావెద్ అన్నారు. కడప నగర శివార్లలోని తెలుగు గంగ కార్యాలయం వద్దగల ఎన్‌సీసీ బెటాలియన్‌లో విద్యార్థులకు బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన దారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మహిళలు దిచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు డ్రెస్, చెన్నీ, చీర కొంగు ప్రమాదవశాత్తు వీల్‌లో చిక్కుకునే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యువత ఓవర్ స్పీడ్, ర్యాష్ డ్రైవింగ్ చేసి ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలతో కుటుంబం ఆర్థికంగా నష్టపోతుందని, యజమాని గాయపడితే కుటుంబ సభ్యుల పడే మనోవేదన ఎవ్వరికీ రాకూడదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము రోడ్డు భద్రతా నిబంధనలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకతాయిలపై డ్రోన్ కెమెరాలతో శక్తి టీమ్ నిఘా


కడపలోని ఓ వీధిలో డ్రోన్ కెమెరాతో తీసిన ఫొటో

కడప కోటిరెడ్డి సర్కిల్: నగరంలోని కళాశాలలు, పాఠశాలల సమీపంలో ఆకతాయిల ఆట కట్టించేందుకు జిల్లా ఎస్పీ ఆదేశాలతో డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్నారు. బుధవారం ఉదయం శక్తి టీమ్ ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు భద్రతపై భరోసా కల్పిస్తూ అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. ఈవ్ టీజింగ్ కు పాల్పడే వారిపై దృష్టి సారించారు. మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టారు. పోలీసులు నిరంతరం విజిలెంట్‌గా వ్యవహరిస్తున్నారు. మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.ఎల్లమరాజు, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ జి.ఈదురు బాషా, ఎస్ఐలు శ్రీనివాసులు, శాంతమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

దురలవాట్లతో జీవితాలు నాశనం చేసుకోవద్దు


సమావేశంలో మాట్లాడుతున్న సిఐ రామకృష్ణ

కడప ఎడ్యుకేషన్: మాదక ద్రవ్యాలకు అలవాటుపడి విలువైన జీవితాలను నాశనం చేసుకోద్దని రిమ్స్ హాస్పిటల్ సైకాలజిస్ట్ డాక్టర్ భాస్కర్ యువతకు సూచించారు. కడప ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మత్తు పదార్థాల నిరోధకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో డ్రగ్స్ అలవాటు మాని ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలని సూచించారు. సీఐ రామకృష్ణ మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వాడకంతో మతిస్థిమితం కోల్పోతున్నారన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించే వారిలో ఎక్కువగా 15-50 సంవత్సరాల వయస్సు లోపు వారే అధికంగా ఉండటం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రమేష్, ఈగల్ క్లబ్ కోఆర్డినేటర్లు కెప్టెన్. డాక్టర్.నీలయ్య, డాక్టర్ సావిత్రి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అపరిచితులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదు

చింతకొమ్మదిన్నె : తమకు తెలియని అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వరాదని సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. బుధవారం సీఐ నాగరాజు ఎన్‌సీసీ 30వ ఆంధ్ర బెటాలియన్‌లో కల్నల్ ఎన్వీ మోనిస్ సహకారంతో సైబర్ క్రైమ్, సోషల్ మీడియాపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం సైబర్ క్రైమ్ రూపంలోనే ఎక్కువ మోసాలు జరుగుతున్నాయని ఎక్కువగా మహిళలను టార్గెట్ చేసి మోసాలు చేస్తున్నారని తెలిపారు. సైబర్ మోసాలు వల్ల మోసపోయిన బాధితులు మానసికంగా నలిగిపోతూ ఆత్మహత్యాప్రయత్నం కూడా చేస్తున్నారన్నారు. ఈకేవైసీ, ఆధార్ అప్డేట్, బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి కాల్ చేసే అపరిచితులకు దయచేసి ఓటీపీలను చెప్పకూడదన్నారు. బ్యాంకు వారు ఎప్పుడు కూడా అటువంటి కాల్స్, మెసేజెస్ చేయరన్నారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి లేదా స్వయంగా సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేస్తే పోలీస్ శాఖ వారు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేస్తున్నారన్నారు. కడప జిల్లా వ్యాప్తంగా సుమారు 20 అవగాహన సదస్సులను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో 300 మంది ఎన్‌సీసీ విద్యార్థులు, సైబర్ క్రైమ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.